ప్రజాశక్తి
సోమవారం 10 జులై 2023 5 శ్రీ సత్యసాయి

నేడు, రేపు అంగన్వాడీల ఆందోళన

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమ, మంగళవారం(రెండు రోజుల పాటు) చేపట్టనున్న ఆందోళనలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. అంగనవాడీ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన తెలిపి అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంటా మన్నారు. అక్కడ రెండు రోజుల పాటు వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు, గ్రాట్యుటీ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలోని అంగన్వాడీలు, సహాయకులు, ఆయాలు అందరూ పాల్గొనాలని, ప్రజాసంఘాలు, అభ్యుదయ వాదులు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప

జిపిఎస్‌ను అంగీకరించం

యుటిఎఫ్ రాష్ట్రకార్యదర్శి వి. కోటేశ్వరప్ప

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సిపిఎస్ స్థానంలో జిపిఎస్ ప్రవేశపెట్టాలనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప స్పష్టం చేశారు. స్థానిక రాజేంద్ర మున్సిపల్ హై స్కూల్ లో జరిగిన యుటిఎఫ్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిపిఎస్‌లో కొత్తదనం ఏమీ లేదన్నారు సిపిఎస్ పథకంలోనే కొన్ని మార్పులు చేసి జిపిఎస్‌గా పేరు పెట్టారని అన్నారు. ఈ పథకంలో భాగంగా ఉద్యోగి తన వేతనంలో 10 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని 33 శాతం పెన్షన్ ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని చెప్పారు. ఉద్యోగికి చివరి వేతనంలో సగభాగం పెన్షన్ గా ఇస్తారని అన్నారు. ఉద్యోగి ఎలాంటి చందా చెల్లించిన అవసరం లేదని అందువల్ల ఒపిఎస్ మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్ రెడ్డి పలు సందర్భాల్లో సిపిఎస్ ను రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఇప్పుడు అధికారంలో ఉన్నప్పటికీ దానిని రద్దు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్పటికే సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించే దిశగా అడుగులు వేస్తున్నాయని అదే విధంగా జగన్మోహన్ రెడ్డి కూడా వెంటనే సిపిఎస్ ను రద్దుచేసి ఒపిఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు పెన్షన్ పథకం వర్తిస్తున్నప్పుడు ఉద్యోగులకు లేకపోవడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సి. లింగమయ్య, గౌరవ అధ్యక్షులు ఎస్‌వివి. రమణయ్య ,ఉపాధ్యక్షులు ఆర్. రామప్ప చౌదరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ ,జిల్లా కార్యదర్శి రవికుమార్, సంజీవ్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడుతో పాటు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.

నేడు చేనేతల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విజయవాడలో ధర్మవరం చేనేత కార్మికులపై దాడికి నిరసనగా సోమవారం(నేడు) పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ చేపడుతున్నట్లు పట్టణానికి చెందిన చేనేత ప్రముఖులు మున్సిపల్ మాజీ ఛైర్మన్ గడ్డం పార్థసారథి, పల్లెం వేణుగోపాల్, గిర్రాజు నగేష్, గిర్రాజు శశి, కోటం ఆనంద్ తెలిపారు. పట్టణంలోని నేనేపేటలో ఉన్న శమీ నారాయణస్వామి దేవాలయంలో ఆదివారం శిల్క్ హౌస్ యాజమానులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరసన ర్యాలీలో పట్టణంలోని చేనేతలు, వ్యాపారులు, అనుబంధ కార్మికులు తప్పనిసరిగా హాజరై ఐక్యతను చాటిచెప్పాలన్నారు. దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని ఆర్డీఓ, డీఎస్పీ, తహశీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. అలాగే అసోసియేషన్ తరపున జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో కలవల మహేష్, గడ్డం శ్రీనివాసులు, నీలూరి ప్రకాష్, బొడగల గిరి, జాకా లోకేశ్, డిఎన్ఎం సుందరేష్, జివి పసాద్, నిరంజన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యంపై బ్యాగుల భారం

విద్యార్థుల బ్యాగులు చూస్తే పెద్దలకే భయం వేయడం ఖాయం. బరువైన స్కూల్ బ్యాగులతో బడులకు వెళ్లే విద్యార్థులను చూస్తున్నాం. అవసరం ఉన్నా లేకపోయినా వేలాది రూపాయలు వెచ్చించి కిలోల కొద్దీ బరువులను విద్యార్థుల వీపునకు తగిలిస్తున్నారు. పుస్తకాలు సంచుల మోతతో పిల్లల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పాఠశాల యాజమాన్యాలు వారి స్వార్థం కోసం టెస్టు పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు వర్క్ బుక్స్ పేరుతో పిల్లలపై పుస్తకాల భారం మోపుతున్నారు. తద్వారా చిన్నారులు విద్యార్థి దశ నుంచే నడుము నొప్పి, కండరాల బలహీనత, మెడ, భుజాల నొప్పితో బాధపడుతున్నారు. ఇలా పలు రుగ్మతుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఇష్టమొచ్చినట్లు పుస్తకాలు అంటగడుతున్నారు. భారీ పుస్తకాల సంచులను మోస్తూ 68 శాతం బాలలు వెన్ను నొప్పిని ఎదుర్కొంటున్నారని ఓ సర్వేలో తేలింది. ముందు వెన్నునొప్పితో ప్రారంభమై ఆ తరువాత గూనిగా మారుతుందని ఆ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
పుస్తకాల బరువు తగ్గాలంటున్న వైద్యులు
అమలుకు నోచుకోని నో బ్యాగ్ డే

ప్రజాశక్తి-హిందూపురం

బాల్యంపై బండరాళ్లుగా మారుతున్న బ్యాగులు చూస్తే పెద్దలకే భయం వేయడం ఖాయం. అంతంత బరువులు వారు ఎలా మోస్తారో... ఒక్కోసారి తలుచుకుంటేనే బాధవేస్తుంది. హమాలీ పని చేస్తున్నట్లు బరువైన స్కూల్ బ్యాగులతో బడులకు వెళ్లే విద్యార్థులను చూస్తున్నాం. అవసరం ఉన్నా లేకపోయినా వేలాది రూపాయలు వెచ్చించి కిలోల కొద్దీ బరువులను విద్యార్థుల వీపునకు తగిలిస్తున్నారు. పుస్తకాలు సంచుల మోతతో పాటు పాఠశాలల్లో సరైన సదుపాయాలు లేక పిల్లల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పోటీ చదువుల పేరిట అటు తల్లిదండ్రులు, ఇటు పాఠశాల యాజమాన్యాలు వారి స్వార్థం కోసం టెస్టు పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు వర్క్ బుక్స్ పేరుతో పిల్లలపై పుస్తకాల భారం మోపుతున్నారు. తద్వారా చిన్నారులు విద్యార్థి దశ నుంచే నడుము నొప్పి, కండరాల బలహీనత, మెడ, భుజాల నొప్పితో బాధపడుతున్నారు. అలసటతో బడి నుంచి సాయంత్రం ఇంటికి వచ్చే సరికే నీరసపడిపోతున్నారు. ఇలా పలు రుగ్మతుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఇష్టమొచ్చినట్లు పుస్తకాలు అంటగడుతున్నారు. పుస్తకాల అధిక బరువు పిల్లల పాలిట శాపంగా మారనుంది. ఉదాహరణకు 1వ తరగతి విద్యార్థికి సుమారు 3 వేల రూపాయల విలువ చేసే పుస్తకాలను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అంటగడుతున్నాయంటే పుస్తకాల మోత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. భారీ పుస్తకాల సంచులను మోస్తూ 68 శాతం బాలలు వెన్ను నొప్పిని ఎదుర్కొంటున్నారని ఓ సర్వేలో తేలింది. 7 సంవత్సరాల నుంచి 13 ఏళ్లలోపు వయసు గల 2500 మంది విద్యార్థులపై అస్సోచామ్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ నిజం వెలుగు చూసింది. ముందు వెన్నునొప్పితో ప్రారంభమై ఆ తరువాత గూనిగా మారుతుందని ఆ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రభుత్వం స్పందించేనా...?

ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల్లో దాదాపు 4540 పాఠశాలలు ఉండగా ఇందులో సుమారు 2,67,317 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పిల్లల వయసుకు మించి పుస్తకాల బరువు మోయకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా మానవ మనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ 1993లో మస్‌పాల్ కమిటీని నియమించింది. ఆ కమిటీ పిల్లల సామర్థ్యానికి మించి బరువులు మోయకూడదనే నివేదిక ఇచ్చింది. దీనిపై 2006లో కేంద్రం చట్టం తీసుకొచ్చింది. పిల్లల బరువులో 10 శాతం బరువు ఉన్న పుస్తకాల కంటే ఎక్కువ మోయకూడదని ఆదేశించింది. కానీ పాఠశాలలు ఇవేవీ పట్టించుకోవడం లేదు. 10 శాతం బరువు కన్నా ఎక్కువ బరువును మోస్తే పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. దీనిపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అమలుకు నోచుకోని నో బ్యాగ్ డే

రాష్ట్ర ప్రభుత్వం 2019 విద్యాసంవత్సరం నుంచి ఒక నూతన పథకానికి శ్రీకారం చుట్టినా అది అమలుకు నోచుకోలేదు. ప్రతి నెల 1వ, మూడవ శనివారం నో బ్యాగ్స్‌డే పద్ధతిని అమలు చేయాలని ఆదేశించినప్పటికీ ఇది ఎక్కడా అమలుకు నోచుకున్న దాఖలాలు లేవు. చట్టం తీసుకోచ్చిన మొదటి నుంచి ఏ పాఠశాల నిర్వాహకులు అమలు చేయలేదు. అయితే పట్టణంలో ఒక పాఠశాల దీనిని అమలు చేసి, ప్రతి శనివారం నో బ్యాగ్ డేను అమలు పరచింది. ఎవరూ అమలు చేయక పోవడంతో వారు సైతం అమలు చేయలేదు.

పుస్తకాల బరువు తగ్గించాలి

పాఠశాలలో అవసరం ఉన్న మేరకే పుస్తకాలు వినియోగించాలి. ప్రతిరోజు విద్యార్థులు అన్ని పుస్తకాలు తీసుకెళ్లకుండా అవసరం మేరకే తీసుకెళ్లేలా పాఠశాలల్లో చర్యలు తీసుకోవాలి. పుస్తకాల బరువు మోయడం ద్వారా పిల్లలు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి నీరసించిపోతున్నారు. చిన్న వయస్సులోనే అనేక రుగ్మతలకు గురవుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

మారుతీ శ్రీనివాస్,
యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

విద్యార్థులపై భారం తగ్గించాలి

పాఠశాలల విలీనం ద్వారా దూరం పెరిగే అవకాశ ఉంది. ఇంత దూరం విద్యార్థులు పుస్తకాల బరువు మోయాలంటే ఇబ్బందికర పరిస్థితే. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించేలా ఆయా పాఠశాలల్లో ర్యాక్స్ ఏర్పాటు చేసి టెక్స్ట్‌బుక్స్ అన్నీ పాఠశాలల్లోనే ఉంచుతూ, హోంవర్క్ బుక్స్ మాత్రమే ఇంటికి తీసుకెళ్లేలా చర్యలు చేపడితే విద్యార్థులపై కొంత భారాన్ని తగ్గించవచ్చు. దీంతో పాటు ప్రవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు అవసరం లేకున్నా పుస్తకాలను తప్పనిసరి కొనాలని నిబంధలను విధించి విక్రయిస్తున్నాయి. ప్రభుత్వం సూచించిన పుస్తకాలనే పాఠశాలల్లో వినియోగించే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

బాబావలి,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

పిల్లల ఆరోగ్యంపై ప్రభావం

చిన్న వయసు పిల్లలు ఎక్కువ బరువు మోస్తే వారి వారి శరీరాకృతి దెబ్బతినే అవకాశం ఉంది. భుజాలు, మెడ, నడుము భాగాల్లో నొప్పి కలుగుతుంది. నీరసంగా అనిపిస్తుంది. విసుగు, తలనొప్పి లాంటి సమస్యలు ఎదురవుతాయి. పిల్లలకు పుస్తకాలతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించేలా విద్యాబోధన ఉండాలి. ఈ విషయంలో పాఠశాలల యాజమాన్యాలు, అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

డాక్టర్ ఆఫ్తాబ్,
చిన్న పిల్లల వైద్య నిపుణులు

మూగజీవాల వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం

పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శుభదాస్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు మూగజీవాలకు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్ తెలిపారు. వేసవిలో వడదెబ్బకు గురయ్యే మూగజీవాలకు ప్రస్తుతం వర్షాకాలంలో వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని ఆయన చెప్పారు. రైతులు వ్యవసాయం తరువాత ప్రాధాన్యత ఇచ్చే పాడి పశువులు, మేకలు, గొర్రెలు, గేదెలు, ఆవులు తదితర మూగజీవాలకు వర్షాకాలంలో పలు సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. చాలామంది రైతులు గ్రామాల్లో పాలు ఉత్పత్తితో జీవనం సాగించేవారున్నారని చెప్పారు. వర్షాకాలంలో తొలకరి జల్లులకు, జడి వానలకు అనేక రోగాలు మనుషులే కాక మూగజీవాలకు సంభవించునున్నాయని అన్నారు.

ఈ నేపథ్యంలో పాడి పశువులకు వ్యాపించే వ్యాధుల పట్ల పశుసంవర్ధక శాఖ తీసుకుంటున్న చర్యలు, ఆ శాఖ పనితీరు గురించి ఆ జిల్లా అధికారి శుభదాస్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి కార్యక్రమంలో పలు అంశాలను వివరించారు.



ప్రశ్న: మూగజీవాలకు వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ చర్యలు గురించి వివరించండి?

జవాబు : వర్షాకాలంలో ఎక్కువగా ముచ్చు వ్యాధి, చిటిక వ్యాధి, పారుడు రోగం, పిడుదులు తోపాటు దోమల బెడద చిన్న జీవాలకు అంటే గొర్రెలు మేకలు తదితర వాటికి వ్యాపిస్తాయి. పెద్ద పశువులకు గొంతు వాపు వ్యాధి, బోలోసిస్ వ్యాధి, గాలికుంట్ల వ్యాధి సోకే అవకాశం ఉంది. రైతులు ఈ వ్యాధుల పట్ల అవగాహన కలిగి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చిటిక వ్యాధి తొలకరి జల్లులలో వచ్చే పచ్చి మేత వల్ల వ్యాపిస్తుంది. ఈ వ్యాధి బలిష్టంగా ఉండే గొర్రెలు మేకలు పొట్టేలుకు వ్యాపిస్తుంది. పొట్ట ఉబ్బరం వచ్చి ఆరోగ్యంగా ఉండే గొర్రెలు చనిపోవడం జరుగుతుంది. ఈ వ్యాధి నివారణకు పశువైద్యశాలలో టీకాలు వేయించాలి. నాలుగు నెలల పైబడిన గొర్రెలు, మేకలకు ఏడాదికి ఒకసారి మే, జూన్ నెలలో ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలి. నీలి నాలుక వ్యాధి దోమల నుండి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి లక్షణాలు కాలికి పుండ్లు లేవడం, అధిక జ్వరం, నోటి పుండ్లు, మూతి వాపు కనిపిస్తాయి. పిల్ల గొర్రెలు ఈ వ్యాధి వల్ల మృతి చెందుతాయి. ఈ వ్యాధులకు వర్షాకాలంలో టీకాలు వేయించితే మంచిది. వీటితోపాటు పారుడు వ్యాధికి కూడా కనిపించిన వెంటనే పశుసంవర్ధక వైద్యశాలలో ఉచితంగా టీకాలు వేయించుకోవాలి.

ప్ర: జిల్లాలో ఎన్ని వైద్యశాలలు ఉన్నాయి? వాటి వివరాలు తెలపండి?

జ : జిల్లాలో మూడు డివిజన్లలో 15 ప్రాంతీయ వైద్యశాలలు, 23 గ్రామీణ వైద్యశాలలు ఉన్నాయి. ఇవి గాక 412 రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలోనే వైద్య సేవలు అందించడం జరుగుతుంది. 13 సంచార వైద్యశాలలు పనిచేస్తున్నాయి. అత్యవసరం అనుకున్నప్పుడు 1962 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేస్తే వెంటనే గ్రామస్థాయిలో వెంటనే అక్కడికి వెళ్లి సంచార వైద్యశాల ద్వారా తగిన మందులు. టీకాలు అందించడం జరుగుతుంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఈ సంచార వైద్య సేవలు అందించబడుతున్నాయి.

ప్ర : జిల్లాలో పశువులు, చిన్న జీవాలు ఎన్ని ఉన్నాయి?

జ : జిల్లాలు ఆవులు, ఎద్దులు కలిసి 2.60 లక్షలు, గేదెలు 0.82 లక్షలు, ఇవి కాక గొర్రెలు మేకలు సుమారు లక్ష వరకు ఉంటాయి.

ప్ర : ప్రభుత్వం నుంచి అందించే దాణా వివరాలు తెలపండి?

జ : జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సుమారు100 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు, జొన్నలు సరఫరా చేయడం జరిగింది. 75 శాతం సబ్సిడీతో వీటిని అందిస్తున్నాము. పశు గ్రాసం కొరత లేకుండా గడ్డి విత్తనాలు తీసుకొని గ్రాసం పెంచుకోవచ్చు.

పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శుభదాస్

ప్ర: పాడి రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

జ : పశుసంవర్ధక శాఖ చేపడుతున్న హెల్త్ క్యాంపులలో రైతులు పాల్గొని పశుపోషణ, సీజనల్ వ్యాధుల పట్ల ముందు జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా నిర్వహించే విజ్ఞాన బడులలో పాల్గొని పాడి సంపదను మరింత పెంపొందించుకోవాలి. ఆయా సీజన్లో తమ మూగజీవాలకు టీకాలు వేయించుకోవాలి.

ప్ర: మీ శాఖలో సిబ్బంది, మందుల కొరత ఉందా?

జ : జిల్లావ్యాప్తంగా 72 మంది శాస్త్ర సహాయకులు గాను 32 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 60 మంది కాంపౌండర్లకు గాను 15 మంది ఉన్నారు. మందుల కొరత లేదు. టీకాలు, తగిన మందులు అందుబాటులో ఉన్నాయి. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాము. వారు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాము.

తరువాతి వంతు శంకర నారాయణదేనా.. ?

హిందూపురానికి బిసి వచ్చాక పెనుకొండ మార్పు తథ్యమా...

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరకొస్తున్న కొద్దీ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రధాన పార్టీలు అభ్యర్థులను సెట్ చేసుకునే పనిలోనున్నాయి. ఈ విషయంలో అధికార వైసిపి మరింత ముందుగా అడుగులేస్తున్నట్టు కనిపిస్తోంది. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తను దీపికాని ఇటీవలనే నియమించిన విషయం తెలిసిందే. అంతకు ముందువరకు ఉన్న మహమ్మద్ ఇక్బాల్‌ను మార్చివేశారు. కురబ సామాజిక తరగతికి చెందిన దీపికను హిందూపురం సమన్వయకర్తగా నియమించడంతో హిందూపురం పార్లమెంటు పరిధిలో దీనికి అనుగుణంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ సామాజిక కూర్పులు మారనున్నట్టు ప్రచారం సాగుతోంది. హిందూపురం పక్కనే వున్న పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో కురబ సామాజిక తరగతికి చెందిన శంకర నారాయణ ఉన్నారు. పార్టీ ప్రారంభం నుంచి జిల్లా కన్వీనర్‌గా ఉంటూ వస్తున్నారు. ఆ తరువాత మంత్రిగానూ ఉన్నారు. మంత్రివర్గ విస్తరణలో ఆయనను పదవి నుంచి తప్పించారు. ప్రస్తుతం సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగానూ ఉంటున్నారు. అయితే స్థానికంగా నేతలకు, ఆయనకు మధ్య విభేదాలు తారా స్థాయిలోనున్నాయి. నియోజకవర్గానికి పార్టీ ఇన్‌ఛార్జి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెళ్లిన సమయంలో శంకరనారాయణపై చెప్పులతో దాడి చేశారు. వ్యతిరేకత తీవ్రంగా ఉండటంతోపాటు, పక్క నియోజకవర్గం హిందూపురానికి కురుబ సామాజిక తరగతికి చెందిన వారినే సమన్వయకర్తగా నియమించడంతో ఈయన మార్పు తథ్యమయ్యే సూచనలు కనిపిస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. కొత్త వ్యక్తిని ఇక్కడికి తీసుకొచ్చే ప్రయత్నాలు సాగుతున్నట్టు సమాచారం. సత్యసాయి జిల్లా వాసే అయిన కర్నాటకలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకునే వ్యక్తిని ఇక్కడికి బరిలో దింపే ఆలోచన సాగుతున్నట్టు కూడా తెలుస్తోంది. బాబురెడ్డి అనే వ్యక్తిని పెనుకొండ అసెంబ్లీ స్థానానికి తీసుకొస్తే ఎలాగుంటుందని అధిష్టానం దృష్టి సారించినట్టు తెలుస్తోంది. బిసికి హిందూపురంలో చోటు కల్పించిన నేపథ్యంలో పెనుకొండలో మరొకరిని తీసుకురావడం ద్వారా అక్కడున్న పార్టీ వివాదాలకు చెక్ పెట్టినట్టవుతుందని కూడా భావిస్తున్నట్టు సమాచారం. అయితే పార్టీకి విధేయుడిగానున్న శంకర నారాయణకు ఏ రకంగా సర్దుబాటు చేస్తారన్నది కూడా పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. వేరే పదవుల్లో ఆయనకు చోటు కల్పిస్తారా లేదా అన్నది కూడా చూడాల్సుంది. ఇలా ఒక్కొక్క నియోజకవర్గంపైనా పార్టీ అధిష్టానం దృష్టి సారిస్తూ మార్పులు, చేర్పులు చేసేందుకు సిద్ధపడినట్టు కనిపిస్తోంది. కొన్ని నెలల్లో వచ్చే సార్వత్రిక ఎన్నికల సమయానికి అన్ని నియోజకవర్గాల్లోనూ సర్దుబాట్లు చేసే ఆలోచన ఇప్పటి నుంచే చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇంకా ఎన్ని నియోజకవర్గాల్లో ఇటువంటి మార్పులుండనున్నాయోనన్న భయం ఎమ్మెల్యేల్లోనూ కనిపిస్తోంది. ఇప్పటికే కొంత మంది నేరుగానే మార్పుల అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.

సగానికిపైగా నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థులు తీసుకొచ్చే ఆలోచనలో అధిష్టానమున్నట్టు ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనిపై ఇప్పటికే ఐ ప్యాక్ సంస్థ కూడా నాయకుల పనితీరుతోపాటు, కొత్త నాయకులు ఎవరైతే బాగుంటుందన్న దానిపై సర్వే చేయించినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రాబోయే రోజుల్లో మార్పులు, చేర్పులు వైసిపిలో మరింత జోరుగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రేపు 'యువగళం' సంఘీభావ పాదయాత్ర

ఓబుళదేవరచెరువు : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2వేల కి.మీ. పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 11వ తేదీ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘీభావ పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆదివారం టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. పాదయాత్ర ఉదయం మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ వద్ద ప్రారంభమై తహశీల్దార్ కార్యాలయం వరకూ సాగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, టిడిపి కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా నా పేరును పరిశీలించండి : సుదర్శన్

రొద్దం : రాబోయే ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని ఎమ్మిగనూరు సుదర్శన్ వైసిపి అధిష్టానాన్ని కోరారు. ఆయన ఆదివారం పావగడ నుంచి తన స్వగ్రామానికి వెళ్తూ స్థానిక వెంకటరమణస్వామి దేవాలయంలో విలేకరు సమావేశంలో మాట్లాడారు. తాను 2014 నుంచి పెనుకొండ వైసిపి టికెట్ ఆశిస్తున్నానని, అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే గెలుస్తానని తెలిపారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 10వ వార్డులో వెలసిన పెద్దమ్మ అమ్మవారికి ఆదివారం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా వార్డు మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో చింతువులును పెద్దన్న, మాజీ కౌన్సిలర్ బుగ్గ నాగరాజు, బుగ్గబాబు, ప్రదీప్ కుమార్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మార్కెట్ యార్డు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఈ నెల 11వ తేదీ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక 'విద్యుత్ అదాలత్' నిర్వహిస్తున్నట్లు పట్టణ ఏఈ గోపి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఉంటే రాత పూర్వకంగా ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చు అన్నారు.

నేడు ధర్నా

కొత్తచెరువు : స్థానిక బిసి కాలనీ సమీపంలోని వేణుగోపాల్‌కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం (నేడు) తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలో ఆదివారం వారు మాట్లాడుతూ కాలనీలో విద్యుత్, సీసీ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదన్నారు. ధర్నాకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు తరలి రావాలని వారు కోరారు.

IN THE COURT OF SENIOR CIVIL JUDGE :PENUKONDA
I.A.No.68/2021, I.A.No.70/2021, I.A.No.71/2021, I.A.No.72/2021, I.A.No.73/2021, in I.A.No.54/2018 in O.S.No. 11/2018

Between:
Boyalapalli Ramanna and others ...Petitioner/Plaintiff
And
Boyalapalli Kondamma and others ...Respondent/Defendent

NOTICE TO RESPONDENT NO :42 to 58

R 42: Narayanamma, W/o Late Boyalapalli Narasimhudu, Aged 45 yers,
R 43: Sreenivasulu, s/o Boyalapalli Narasimhudu, Aged 45 yers,
R 44: Nagendra, s/o Late Boyalapalli Narasimhudu, Aged 45 yers,
R 45: Bagyamma, W/o Late Boyalapalli Anjineyulu, Aged 36 yers,
R 46: Shankara, S/o Late Boyalapalli Anjineyulu, Aged 19 yers,
R 47: Kavitha, D/o Late Boyalapalli Anjineyulu, Aged 16 yers,
R 48: Kalpana, D/o Late Boyalapalli Anjineyulu, Aged 14 yers,
R47 and 48 are Minors, rep by Their Mother Bagyamma All are R/o Munimadugu (Vi) Penukonda (M) Sri Sathya Sai District.

ఇందుమూలముగా మీకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు దావాలోని ప్రతివాదులు R4 బోయనపల్లి నరసింహులు R11 బోయనపల్లి ఆంజినేయులు, R38 సిరిగిలేని నరసింహుడు, R41 సిరిగిలేని నరసింహులు చనిపోయినందున వారి వారసులు అయిన మిమ్ముల్ని పై దావాలో ప్రతివాదులుగా చేర్చమని I.A.No:68/2021, I.A.No:70/2021, I.A.No:71/2021, I.A.No:72/2021 And I.A.No:73/2021 అర్జీని దాఖలు చేసినారు. సదరు విషయములై నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల నీవు 12/07/2023 ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ హాజరు అయి నీ వాదనలు తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు సదరి అర్జీని తీర్మానం చేయుదురని యిందు మూలముగా నీకు తెలియచేయటం అయినది.

(By Order Of The Court)
శ్రీ.ఎల్.విశ్వనాథ్ అడ్వకేట్, పెనుకొండ

IN THE COURT OF SENIOR CIVIL JUDGE :PENUKONDA
I.A.No.522/2021 in O.S.No.59/2017

Between:
Voddi Nagappa @ Penukonda Nagappa Died By LRs ...Petitioner/Plaintiff
And
Gorantla Obulesu and others ...Respondent/Defendent

NOTICE TO RESPONDENT NO :5

R 5: Aruna, Aged 32 yers, W/o Aswartha Narayana, Hindu, Agricultural Paipalli Village, Puttaparthi Mandal, Sri Sathya Sai District.

ఇందుమూలముగా మీకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు దావాలోని 3వ ప్రతివాది గోరంట్ల ఓబులమ్మ చనిపోయినందున ఆమె వారసులైన మిమ్ముల్ని పై దావాలో ప్రతివాదులుగా చేర్చమని I.A.No:522/2021 అర్జీని దాఖలు చేసినారు. సదరు విషయములై నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల నీవు 12/07/2023 ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ హాజరు అయి నీ వాదనలు తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు సదరి అర్జీని తీర్మానం చేయుదురని యిందు మూలముగా నీకు తెలియచేయటం అయినది.

(By Order Of The Court)
శ్రీ.ఎల్.విశ్వనాథ్ అడ్వకేట్, పెనుకొండ

కలిసి నడుద్దాం.. విజయం సాధిద్దాం...

వైసిపి సమన్వయ కర్త దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

దీపికను గజ మాలతో స్వాగతం పలుకుతున్న సాధిక్

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నా వైసిపి కుటుంబ సభ్యులందరూ సమిష్టిగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి జగనన్నకు బహుమతి గా ఇద్దామని నూతన సమన్వయకర్త దీపిక తెలిపారు. వైసిపి సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన దీపిక తొలిసారిగా ఆదివారం హిందూపురం రాగా స్వాగతం పలకడానికి నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో కర్నాటక సరిహద్దుకు చేరుకున్నారు. తూముకుంట చెక్ పోస్టు వద్దకు వచ్చిన దీపికకు పుష్పగుచ్ఛాలు అందజేసి, టపాసులు పేల్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దీపిక గొర్రె పిల్ల ఎత్తి నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేశారు. అనంతరం అక్కడి నుంచి వేలాది మందితో కలిసి ద్విచక్ర వాహన ర్యాలీగా హిందూపురం పట్టణం చేరుకుని పరిగి బస్టాండ్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి అంబేద్కర్ సర్కిల్ చేరుకుని అక్కడ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అసమ్మతి నాయకులందరినీ నేరుగా కలిసి సహకరించాలని కోరి అందరినీ కలుపుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగు తామన్నారు. ర్యాలీలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వేణురెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి హనుమంతరెడ్డి, కౌన్సిలర్లు మారుతిరెడ్డి, శివ, ఆసిఫ్, డిష్ నాగరాజు, వెంకటేష్‌రెడ్డి, మహేష్ గౌడ్, రామచంద్ర, నాగేంద్ర బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అందుబాటులోకి 30 పడకల ఆసుపత్రి

ప్రజాశక్తి-తనకల్లు

తనకల్లు ఆసుపత్రి

తనకల్లులో ఆహ్లాదకరమైన వాతావరణంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేశారని, అందులో పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ ముబసిర ఆదివారం తెలిపారు. అన్ని విభాగాలకు చెందిన వైద్యులను ప్రభుత్వం నియమించిందని, ఎక్స్ రే తప్ప మిగిలిన యంత్ర పరికరాలు వచ్చాయన్నారు. మహిళలు, గర్భిణుల కోసం గైనకాలజిస్టు అందుబాటులో ఉంటారని, మహిళలకు కుటుంబ నియంత్రణ(కు.ని)తో పాటు చిన్న చిన్న ఆపరేషన్లు(శస్త్రచికిత్స) చేయడానికి సర్జన్ సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఫిజియోథెరపీ, రేడియాలజీ, తదితర సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండల పరిధిలో చాలా గ్రామాలు ఉన్నాయని, ఎక్కువ శాతం పేదలు నివసించే గ్రామీణ ప్రాంతాలు, తండాలు అనేకం ఉన్నాయని వారందరికీ వైద్య సేవలందించడానికి సిబ్బంది నిత్యం సిద్ధంగా ఉంటారన్నారు. ఎటువంటి ఖర్చు, పట్టణాలు, సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉచితంగా వైద్యం పొందవచ్చు అన్నారు. రాబోయే వర్షాకాలంలో దోమల ద్వారా రోగాలు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కావున దోమల నివారణలో భాగంగా మురుగు, వర్షం నీరు, నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు.

'గుండుమల'ను విమర్శించే స్థాయి వైసిపికి లేదు

ప్రజాశక్తి-మడకశిర

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిని విమర్శించే స్థాయి మడకశిర వైసిపి నాయకులకు లేదని టిడిపి నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. పట్టణంలోని బాలాజీనగర్ పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ ద్వారా మొట్టమొదటి సారిగా మడకశిరకు నీళ్లు తెచ్చిన ఘనత గుండుమల తిప్పేస్వామిది అన్నారు. పట్టణంలో రోడ్లు, హైవే, రింగ్ రోడ్డు, వంద పడకల ఆసుపత్రి, టూరిజం గెస్ట్ హౌస్, ఇండోర్ స్టేడియం, తహశీల్దార్ కార్యాలయంతో పాటు రూ. 40 కోట్ల నిధులు మంజూరు చేయించి ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేశారన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చిన నాయకుడు గుండుమల అన్నారు. దళిత నాయకులను రెచ్చగొడుతూ రాక్షసానందం పొందుతున్న వ్యక్తి తిప్పేస్వామి అని విమర్శించారు. వైసిపి హయాంలో మడకశిర అభివృద్ధిపై బహిరంగ చర్చకు రండని సవాల్ విసిరారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మనోహర్, కార్యదర్శి పుల్లయ్య చౌదరి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తర్‌సాబ్, తలమర్ల సుబ్బరాయుడు, గోపాలప్ప, డాక్టర్ సెల్ కృష్ణమూర్తి, నాయీబ్రాహ్మణ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మార్కెట్ బాబు, గంగాధరప్ప, రమేష్, రవి, ఎస్.నగేష్, యూనిట్ ఇన్‌ఛార్జి నాగేంద్ర, మంజు, కమలాకర్, ఉన్నారు.

కోటలో శాసనాలను కాపాడండి

చరిత్రకారుడు మైనాస్వామి

ప్రజాశక్తి -పెనుకొండ

కోటలో చెత్తను చూపుతున్న చరిత్రకారుడు మైనాస్వామి

విజయనగర సామ్రాజ్యంలో ముఖ్య భూమిక పోషించిన పెనుకొండ కోట నిర్మాణ విశేషాలను వివరిస్తున్న ప్రాచీన శాసనాన్ని కాపాడాలని చరిత్రకారుడు మైనాస్వామి భారత పురావస్తు శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం పట్టణంలోని పెనుకొండ చరిత్రకు మూలాధారమైన శాసనాలు, కోట ఉత్తర ద్వార పరిసరాలను పరిశీలించారు. విజయనగర రాజ్యం, పెనుకొండ చరిత్ర రచనకు ప్రాణాధారమేగాక ప్రత్యక్ష సాక్షిగా ఉన్న శాసనం పగిలిపోయి ఉండడం, అక్కడే చెత్తకుప్ప ఉండడంతో చూసి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోట ఉత్తర ద్వార ప్రవేశం లోపలివైపున గోడ దిమ్మెపై ఉన్న ఆ శాసనానికి, కోట భాగానికి తక్షణం మరమ్మతులు చేయాలని పురావస్తు శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు ఐఎస్ఐ డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాయనున్నట్లు తెలిపారు.

సౌకర్యాలు కల్పించండి.. లేదా గుడ్‌విల్ వెనక్కివ్వండి

ప్రజాశక్తి-హిందూపురం

భవనం ముందు ఆందోళన చేస్తున్న మార్కెట్ వ్యాపారులు

పురపాలక సంఘ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన వాణిజ్య సముదాయంలో వ్యాపారులు, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు వెంటనే కల్పించాలని, లేనిపక్షంలో తాము చెల్లించిన గుడ్‌విల్ డబ్బులు వెనక్కి ఇవ్వా లని గదులను అద్దెకు తీసుకున్న వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు పట్టణంలోని వాణిజ్య సము దాయ భవనం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నిమ్మకాల రాము, రెహ్మాన్ మాట్లాడుతూ గదులు అద్దెకు తీసుకుని 8 నెలల గడుస్తున్నా అక్కడ కనీస సౌకర్యాలు కల్పించలేదని, దీంతో ఎవరూ వ్యాపారాలు ప్రారంభించలేదన్నారు. అయితే మున్సిపల్ అధికారులు గదులకు అద్దెలు చెల్లించాలని నోటీసులు ఇవ్వడం ఎంత వరకూ న్యాయం అని ప్రశ్నించారు. అద్దెలను మాఫీ చేసి, వెంటనే ఆ ప్రాంతంలో ఉన్న తోపుడు బండ్ల వ్యాపారాలను ఖాళీ చేయించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని, లేనిపక్షంలో తాము చెల్లించిన గుడ్‌విల్‌ను తిరిగి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ యూనియన్ నాయకులు రెహ్మాన్, వినయ్, నాగిరెడ్డి, సతీష్, నవీన్, చంద్ర, నూరుల్లా, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మడకశిర

వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని విశ్రాంత డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నిర్వాహకులు డాక్టర్ దినకర్ అనంతపురం వైద్యశాలలో చిన్నపిల్లల డాక్టర్‌గా పని చేస్తున్నారు. అమరాపురం గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు నరసింహప్ప జ్ఞాపకార్థం కుమారుడు దినకర్ నియోజకవర్గంలోని పేదలకు ఉచితంగా వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ప్రతి ఆదివారం ఒక మండలాన్ని ఎంచుకొని వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఆయన కంటి, గుండె వైద్య నిపుణులను సైతం శిబిరానికి పిలిపించి వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్య పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరమైన వారిని ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. ఇప్పటికే అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ మల్లికార్జున, వెలుగు ఎలొసి లక్ష్మీకాంత, సిసి దేవరాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజలకు వివరిసున్న టిడిపి నాయకులు

'అబద్ధాల సిఎం జగన్‌ను గద్దె దించండి'

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక వాగ్ధానాలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకపోగా, ప్రజలపై భారాలు మోపి మోసగిస్తున్న సిఎం జగన్‌ను ప్రజలు ఓటు ద్వారా గద్దె దించాలని టిడిపి నాయకులు కోరారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం వారు పట్టణంలోని 25వ వార్డు ఎల్‌బిసి కాలనీలో ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ జగన్ ఒక్క ఛాన్స్ అంటూ అమలు కానీ వాగ్ధానాలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క వాగ్ధానాన్ని నెరవేర్చకపోగా నిత్యావసర సరుకులు, బస్సు, విద్యుత్ ఛార్జీలతో పాటు అన్నింటి ధరలను విపరీతంగా పెంచి సామాన్య, పేద ప్రజల నడ్డి విరిచారన్నారు. అంతేకాకుండా బిసిలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ధర్మవరం లో నియంత పాలన సాగుతోందన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేయించడం, కేసులు బనాయించడం లాం టి వాటికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్‌హుస్సేన్, కేశగాళ్ల శీన, చీమల రామాంజి, అంకన్న, జయరాములు, గంగాధర్, చీమల సుబ్బరాయుడు, సాయినాథ్, ఆదికేశవులు, చీమల సూరి, కార్తీక్‌బాబు, మల్లికార్జున, మధు పాల్గొన్నారు.

చేనేత కార్మికులపై దాడి దుర్మార్గం : 'చిలకం'

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం చేనేత వస్త్ర వ్యాపారులు బకాయి అడగడానికి వెళ్తే విజయవాడలో వైసిపి నాయకుడు అవినాశ్ దాడి చేయడం దుర్మార్గమని, మా చేనేత కార్మికుల జోలికి వస్తే సహించేదిలేదని జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన ఆదివారం బాధిత వస్త్ర వ్యాపారులు గిర్రాజు శశి, కోటం ఆనంద్‌లను వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి జరిగిన సంఘటన గురించి అడిగితెలుసుకున్నారు. ఎంతో నమ్మకంతో రూ. లక్షల విలువ చేసే పట్టుచీరలను అప్పుగా ఇస్తే దాడులు చేయడం ఏంటని మండిపడ్డారు. దాడికి పాల్పడిన అవినాష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి

ప్రజాశక్తి-కదిరి టౌన్

జిల్లాలోని ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ ఆదివారం నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఉద్యోగుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తు న్నారని, మోటారు రవాణా చట్టాన్ని అతిక్రమించి పనులు చేయిస్తున్నార ని, బకాయిలు ఇప్పించడం లేదని, అక్రమ బదిలీలు, సస్పెన్షన్లు, ఛార్జిషీట్లు ఇస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడు తున్నాడని, పనిముట్లు తెప్పించడవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వి.రమణ, రీజినల్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గంగన్న, అధ్యక్షులు రామక్రిష్ణ, సెక్రటరీ బైరిశెట్టి, బి.కేశవరెడ్డి, సోమిరెడ్డి, ఈశ్వరరెడ్డి, శేఖర్, గంగిరెడ్డి, బాబుఖాన్, గురుమూర్తి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వస్త్రవ్యాపారి మృతికి నివాళి

కదిరి టౌన్ : పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద కీర్తి గార్మెంట్స్ నిర్వహిస్తున్న వస్త్ర వ్యాపారి శంకర్‌రెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ వస్త్ర వ్యాపారి స్వగ్రామమైన కడప జిల్లా రాయచోటి మండలంలోని తుమ్మల గింజలపల్లికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాత్రికేయులపై దాడులు హేయం

ప్రజాశక్తి -పెనుకొండ

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇలియాజ్

పాత్రికేయులపై దాడులు హేయమైన చర్య అని, జర్నలిస్టులపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే అని ఘనగిరి పాఠశాల కరస్పాండెంట్ ఏనుగుల ఇలియాజ్ అభిప్రాయ పడ్డారు. ప్రముఖ జర్నలిస్ట్ తులసీ చందుకు మద్దతుగా ఆదివారం పట్టణంలోని ఘనగిరి స్కూల్‌లో సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ ఏ.హరి అధ్యక్షతన సంఘీభావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు గౌతమీ మాట్లాడుతూ మహిళా జర్నలిస్ట్‌పై దాడిని అందరూ ఖండించాలని తెలిపారు. నాగార్జున మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా ఒక మూలస్తంభం అని, నిజాలని నిర్భయంగా చెప్పే మహిళా జర్నలిస్ట్‌పై మీడియాలో దారుణంగా ట్రోల్ చేయడం క్షమించరాని నేరం అని, వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ రవూఫ్, సిఐటియు నాయకులు రమేష్, బాబావలి, గంగాధర్, ఉత్తప్ప, యూటిఎఫ్ నాయకులు రమేష్, షేక్ ఫయాజ్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'గుండుమల' పరామర్శ

మడకశిర : మండల పరిధిలోని వైబి.హళ్లి పంచాయతీలోని జిల్లేడుగుంట గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ రామచంద్రగౌడ్ కొన్ని రోజుల క్రితం గుండెపోటుతో మరణించాడు. దీంతో ఆదివారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆ గ్రామం వెళ్లి రామచంద్రగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, వైస్ సర్పంచి హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు హనుమంతరాయప్ప, రవీంద్రారెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

భవననిర్మాణ కార్మికుల సంక్షేమం పట్టని ప్రభుత్వం

గాండ్లపెంట : ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ విమర్శించారు. మండల పరిధిలోని ముళ్లమీదపల్లి పంచాయతీలో ఆదివారం రామాంజనేయులు అధ్యక్షతన సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన జిఒల వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని, సంక్షేమ పథకాల అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సభ్యులు ఆదినారాయణ, సోమశేఖర్, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

23న బిసి ప్రజా సింహగర్జన

పుట్టపర్తి క్రైమ్ : విజయవాడలో ఈ నెల 23వ తేదీ జరిగే బిసి ప్రజా సింహగర్జనను విజయవంతం చేయాలని జిల్లా యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం జిల్లా నాయకుడు వరప్రసాద్ ఆధ్వర్యంలో పుట్టపర్తి బస్టాండ్‌లో ప్రజా సింహగర్జన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త పుంగనూరు రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో ఈ మహా సింహగర్జన జరుగుతుందన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా జరిగే చేపట్టనున్న ఈ మహాగర్జనలో బిసిలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యాదవులు అభివృద్ధికి కార్యాచరణను ఆ గర్జనలో ప్రకటిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా నియోజకవర్గ నాయకులు దయ్యాల ఉమాపతి యాదవ్, కిరణ్‌యాదవ్, అంగడి రాజాయాదవ్, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మృతిచెందిన నసీం అహ్మద్

వ్యవసాయ పొలం వద్ద విద్యుత్తు లైన్ లాగుతుండగా పైన వెళ్తున్న విద్యుత్తు వైర్లకు లాగుతున్న వైర్లు తగలడంతో విద్యుత్ సరఫరా అయింది. దీంతో విద్యాదాఘాతానికి గురైన వ్యక్తిని రక్షించబోయి మృత్యువాత పడిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని విశ్వనాథపురం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. బత్తలపల్లికి చెందిన నసీం అహ్మద్ అలియాస్ ఢిల్లీ మెకానిక్(45) విద్యుత్ లైన్ లాగే సమయంలో షాక్‌కు గురై మీత్యువాత పడ్డాడు. బత్తలపల్లికి చెందిన తన స్నేహితుడైన వడ్డే వెంకటనారాయణ విశ్వనాథపురం వద్ద తన పొలానికి విద్యుత్ లైన్ లాగుతున్న సమయంలో లాగుతున్న లైన్ కంటే పైన ఉన్న విద్యుత్ లైన్ తీగలకు తగలడంతో లాగుతున్న వైర్లకు విద్యుత్ ప్రవహించింది. దీంతో మంజుల చందు, మంజుల వెంకట నారాయణ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. అక్కడే ఉన్న నసీం అహ్మద్ వారిని రక్షించే క్రమంలో విద్యుత్ తీగలను తొలగిస్తుండగా షాక్‌కు గురికాగా వెంటనే ఆర్డిటి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రమా దంలో వడ్డే మంజుల వెంకటనారాయణ, మంజుల చందులకు స్వల్ప గాయాలయ్యాయి. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలియగానే వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, తదితరులు ఆర్డిటి ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం డివైడర్‌ని ఢీ కొన్న సంఘటనలో రామగిరికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరు వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం కొడికొండ చెక్‌పోస్టు వద్ద అదుపు తప్పి డివైడర్‌ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో రామగిరికి చెందిన ఆదిమూర్తి తీవ్రంగా గాయపడగా అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా:'పల్లె'

ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్

ఆర్థిక సహాయం అందజేస్తున్న పల్లె

టిడిపి కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటామని అధైర్య పడొద్దని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పల్లె ఆదివారం పుట్టపర్తిలో విస్తృతంగా పర్యటించారు. అందులా భాగంగా అనారోగ్యం తో ఉన్న వారి ఇళ్లకు వెళ్లి పరామ ర్శించి ఆర్థిక సాయం అందజేశా రు. కష్టాల్లో ఉన్న కార్యకర్తలను ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని కర్నాటక నాగేపల్లిలో టిడిపి కార్యకర్త శ్రీనివాసులు అనారోగ్యంతో ఉన్నాడని తెలిసి పల్లె వారి ఇంటికెళ్లి యోగక్షేమాలు అడిగి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న రమణ ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందించారు. అలాగే వంట మాస్టారుగా పేరున్న రామయ్య శనివారం మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే పట్టణంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల యోగక్షేమాలు తెలిసుకుని, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ సమస్యలు పరిష్కరిస్తామని పల్లె హామీ ఇచ్చారు.

పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలో ని పెడపల్లి పెద్దతండా వాసి పూజారి బాపూజీ నాయక్ పదవీ విరమణ సందర్భంగా ఆదివా రం పెడపల్లి తండాలో సర్పంచి మంగ్లీబాయ్, పారిశ్రామికవేత్త ఎర్ర భాస్కర్, వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్‌నా యక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. బాపూజీ నాయక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బెంగళూరు బ్రాంచ్‌లో ఎజిఎంగా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందారు దీంతో మంగ్లీబాయ్ ఆధ్వర్యంలో తండావాసులు ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బండ్ల మోహన, రవీంద్రనాయక్, శ్రీనివాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రొళ్ల : మండల పరిధిలోని కె.బ్యాడిగెర గ్రామంలో వెలసిన కాలువ రంగనాథస్వామి రథోత్స వం ఆదివారం వైభవంగా నిర్వహించారు. రథోత్సవంలో మడకశిర నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు గుండుమలకు పూలమాల, శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమం లో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, గురుమూర్తిస్వామి, తిమ్మప్ప, కాకి రాజన్న, కృష్ణప్ప, సిద్ధగంగప్ప, ఈరన్న, మూర్తి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్కమ్మగార్ల పరుష

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని సుబ్బరాయనిపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన అక్కమ్మ గార్ల ఉత్సవాలు మూడు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. అర్చకులు చిన్ననాగప్ప, రాంబాబు అమ్మవార్లను పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 12 ఏళ్ల లోపు బాలికలు అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, సోమ కోటి ఆదినారాయణ పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షిణలు చేసి అనంతరం పోటీలు నిర్వహించారు.

దీపికకు సంఘీభావంగా బైక్ ర్యాలీ

చిలమత్తూరు : వైసిపి అధిష్టానం నూతనంగా ప్రకటించిన హిందూపురం సమన్వయకర్త దీపిక(వేణురెడ్డి)కి సంఘీబావం తెలుపుతూ ఆదివారం చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో చిలమత్తూరు కనుమ నుంచి హిందూపురం తూమకుంట చెక్‌పోస్టు వరకూ ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి తిరుమలేష్, నాయకులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కళాజ్యోతి ప్రాంగణంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉబ్బర రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం కుమార్తె లిఖిత, అల్లుడు విశ్వతేజారెడ్డి శిబిరం ఏర్పాటుచేయగా శంకర కంటి ఆసుపత్రి బెంగుళూరు, జిల్లా అంధత్వ నివారణ కేంద్రం వైద్యులు 228 మందికి కంటి పరీక్షలు చేసి 129మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. శిబిరంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జయసింహ, నాగభూషణ, క్లబ్ ప్రతినిధి సుదర్శన్‌గుప్తా, క్యాంపు ఛైర్మన్ నరేంద్రరెడ్డి, శంకర కంటి ఆసుపత్రి వైద్యురాలు దివ్య, పిఆర్ శివప్రకాష్, మనోహర్‌గుప్తా, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి కేంద్రాన్ని పున:ప్రారంభించాలి

ముదిగుబ్బ : స్థానిక దొరిగిల్లు రోడ్డులో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్షిత తాగునీటి సరఫరా కేంద్రాన్ని తక్షణమే పున:ప్రారంభించాలని సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ముదిగుబ్బలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాదిగా తాగునీటి కేంద్రాన్ని మూసివేయడంతో స్థానికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో సంబంధిత ప్రభుత్వ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుంజే పల్లి కృష్ణయ్య, తిప్పయ్య, డాబా కిష్ట, శ్రీరాములు, టి.చిన్నప్ప, లింగప్ప, ఈశ్వరనాయక్, వెంకటనారాయణ, పాల్గొన్నారు.